IJMRT: Volume (1), Issue 2, April 2019

ISSN (Print) : 2663-2381
ISSN(Online) : 2663-4007

International Journal of Multidisciplinary Research Transactions

(A Peer Reviewed Journal)

www.ijmrt.in

# తిక్కన రచనారీతులు – నాటకీయత

## డా. ఎం.పద్మకుమారి*

*అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, (స్వయం), బేగంపేట్ హైదరాబాద్ - 16.*

*Corresponding author

---

తిక్కన తండ్రిపేరు కొమ్మన దండననాథుడు. ఇంటిపేరు కొట్టరువు వారు. క్రీ.శ. 13వ శతాబ్దికి చెందిన తిక్కన మనుమసిద్ధి ఆస్థానకవి. తెలుగు సంస్కృత భాషలలో ప్రతిభాశాలి. కవిబ్రహ్మ, ఉభయకవి మిత్రుడు ఇతని బిరుదులు.

తిక్కన ఆంధ్రమహాభారతములోని విరాటపర్వము నుండి స్వర్గారోహణ పర్వము వరకు మొత్తము పదిహేను పర్వాలను ఏకధాటిగా రచించిన కవిబ్రహ్మ. శైవ వైష్ణవ మతాల సమైక్యతకు 'హరిహరనాథ తత్త్వము"ను రూపొందించి "విష్ణు రూపాయ నమశ్శివాయ" అని ప్రకటించిన సమన్వయకర్త. తాను రచించిన ఆంధ్రమహాభారత భాగాన్ని హరిహర నాథునికి అంకితమిచ్చి శివ కేశవులను సమానంగా సేవించి, మతావేశాలను తగ్గించి, ప్రశాంతమైన వాతావరణానుకూలతను ఏర్పర్చగలిగారు.

సరసకవులు మెచ్చేవిధంగా రచించి తెలుగుభాషకు గౌరవాదరాలను కలిగించిన కవిశ్రేష్ఠుడు. ఆంధ్రావళి మోదము కోరి మహాకవిత్వ దీక్షావిధితో ఆంధ్రమహా భారతమును రచించ సంకల్పించినానని చెప్పి రచనకు శ్రీకారం చుట్టినారు.

తిక్కన కవితాగుణాలలో మొట్టమొదటిది నాటకీయత. సన్నివేశానికి తగినట్లుగా, స్థల వర్ణన, పాత్రల మనస్తత్వ వర్ణన, ఆంగికావస్థల వర్ణన హావభావవ్యక్తీకరణ తిక్కన ప్రత్యేకత. భారతకథ అంతా సంభాషణలతోనే సాగింది. కథను తిక్కన తాను చెప్పినట్లు కాకుండా పాత్రల ద్వారానే చెప్పిస్తాడు. పాత్రల మనోవృత్తులను, భావవికారాలను స్పష్టమైన పదాలతో వ్యక్తపర్చి, ఒక దృశ్యాన్ని కనుల ముందుంచుతారు. నాటకీయతకు నిదర్శనమైన ఘట్టాలు అనేకమున్నా ముందుగా గుర్తొచ్చేది

ద్రౌపది కీచకుని ఇంటికి వెళ్ళినప్పటి దృశ్యము.

పాండవులు విరాటరాజు కొలువులో అజ్ఞాత వాసం చేస్తున్నప్పుడు ద్రౌపది సైరంధ్రిగా వున్నది. ద్రౌపదిని కీచకుని ఇంటి నుండి మద్యం తెమ్మని పంపుతుంది సుదేష్ణ. కీచకుడు దుర్మార్గుడు, బలవంతుడు. కీచకునికి భయపడ్డ ద్రౌపది మానసిక స్థితిని తిక్కన చాలా చక్కగా వర్ణించాడు.

**"దైన్యంబు తలపోత తలకొన్న చెలువకాననమును వెల్లదనంబు**
**భయరసవేగంబు పైకొని ముట్టిన కాంతకు తనులత కంపమదరె**
**బెగదంతకంతకు మిగిలిన నింతికి పదములనట దొట్రుపాటు బెరసె**
**దల్లడం బొందిన దన్వికి నవయవంబుల నెల్ల ఘర్మాంబు కళిక లెసగె"**

భయకంపితమైన ఒక స్త్రీ మనోవృత్తిని శరీరంలో కలిగిన మార్పులను, ఎంతో నేర్పుగా వర్ణించి ద్రౌపదిని కనుల ముందుంచారు.

తిక్కన నాటకీయతకు సంజయ రాయబారము, శ్రీకృష్ణ రాయభారములు చక్కని చిహ్నాములు. ఈ రెండు ఘట్టాలు ప్రత్యేక దృశ్యకావ్యాలుగానే చెప్పవచ్చును. సంభాషణలు, యుద్ధవర్ణనలు, ప్రశ్నార్థకాలు నాటకీయతకు పట్టునిచ్చాయి. కౌరవసైన్యమును చూసిన ఉత్తర కుమారుని అవస్థను వర్ణించిన తిక్కన చక్కని చమత్కారి.

సన్నివేశాలకు తగిన భాషను ప్రయోగించడం సంభాషణా చాతుర్యానికి నిదర్శనము. కీచకుని చూచిన భీముడు కోపములో ఉన్నప్పటి సన్నివేశాన్ని కన్నులకు కట్టినట్లు వర్ణించాడు.

**"కనుగొని కోపవేగమున గన్నుల నిప్పులు రాల నంగము**
**ల్ల నలగ సాంద్ర ఘర్మ సలిలంబులు గ్రమ నితాంత దంత సీ**
**దన రట దాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్త న**
**ర్తన ఘటనా ప్రకార భయదస్ఫురణా పరిణద్ధ మూర్తియై"**

కీచకుని చూచిన భీముని కన్నులు నిప్పులు క్రక్కినయి. శరీరమంతా చెమటలు పట్టగా పళ్ళు పటపటమని కొరుకుతూ చూపరులను భయభ్రాంతులను చేస్తాడు.

మహాభారతంలో ప్రధానంగా శాంత రసమే అంగిరసం. వీర, రౌద్ర, బీభత్స, హాస్యరసాలు అంగరసాలుగా వున్నాయి. సందర్భాన్ని బట్టి రసావిష్కరణ చేయడంలో తిక్కనకు తిక్కనయే సాటి. యుద్ధ పంచకంలో రౌద్రము, వీరము, భయానకం, భీభత్సరసాలను, స్త్రీ పర్వంలో కరుణ రసాన్ని ఉత్తరాభిమన్యుల వివాహసన్నివేశంలో శృంగార రసాన్ని, కౌరవ సైన్యాన్ని చూచిన ఉత్తరుని తత్తరపాటులో హాస్య రసాన్ని పండించారు. సమయోచిత శైలీ ప్రయోగముతో రసావిష్కరణ చేసిన

కవిబ్రహ్మ తిక్కన.

తిక్కన వర్ణనలు భారతాన్ని రసరమ్య కావ్యంగా తీర్చిదిద్దాయి. వర్ణనలన్నీ ఔచిత్యంతోకూడి కథాగమనానికి పట్టునిచ్చాయి. పాత్రల మనస్తత్వానికి స్పష్టతను, రసస్పష్టికి స్ఫూర్తినిచ్చాయి.

భారత యుద్ధములో కర్ణుడు మరణించిన సందర్భములోని వర్ణన ఔచితీశోభతో విరాజిల్లుతుంది.

**"నిర్గత ప్రాణు రాధేయు నిజ కరముల**
**కరుణ పెంపున నంటుట కారణముగ**
**పావన స్నాన మొనరింప బోవునట్టు**
**లపర జలనిధి లోనికి సరిగె నినుడు"**

సూర్యపుత్రుడైన కర్ణుడు మరణించినపుడు, సూర్యుడికీ కర్ణుడికీ గల సంబంధాన్ని ఎంతో సమయస్ఫూర్తితో చెప్పి భావనకు బలాన్ని చేకూర్చారు.

భారతంలోని పాత్రలన్నీ విభిన్న మనస్తత్వాలకు నిలయాలు. ప్రతి పాత్రకు ప్రాధాన్యమిచ్చి స్వభావాలను వివరించి స్పష్టత చేకూర్చాడు తిక్కన. నాటకీయతకు పాత్రపోషణే ప్రాణం. ద్రౌపది అభిమానవతి. కోపమొచ్చినప్పుడు సూటిగా మాట్లాడే ధైర్యంగ సాహసం గలది, అసలైన తెలుగు వనిత. ధర్మరాజు ఔన్నత్యం గల మెత్తని పులి. భీముడు కండ పుష్టితో ఆవేశం గలవాడు, ఉచితానుచితాలు తెలియని వాడు. దుర్యోధనుడు మితిమీరిన విశ్వాసంతో ఎవరినీ లక్ష్యపెట్టనివాడు. సంజయుడు వివేకి, భీష్మ ద్రోణులు ఎవరిని ఏమన లేక కుమిలిపోయేవారు. కర్ణుడు విధి వంచితుడు, మిత్రధర్మానికి కట్టుబడివున్న వాడు.

వ్యాసుని పాత్రలకు తెలుగుదనం అద్ది చిరస్థాయిని కల్పించినాడు. ఏ పాత్ర మాట్లాడినా, ఏ సన్నివేశం చూసినా తెలుగుదనం ఉట్టిపడుతుంది. వ్యంగ్య వైభవ శైలితో కడు నేర్పుగా పాత్రసృష్టి గావించారు. తిక్కన రచనా రీతులలో వ్యంగ్యము ముఖ్యమైనది. తెలుగు వాడి సహజలక్షణమైన వ్యంగ్యము సందర్భాను సారంగా పాత్రలచే పలికించి ఆయా సన్నివేశాలను పరిపుష్టం చేశాడు.

ద్రౌపది రాయబారానికి వెళ్తున్న కృష్ణునితో "ఇవి దుస్ససేనుబ్రేళ్ళం దవిలి సగము ద్రవ్విపోయి దక్కినయని, కౌరవులకడ తీయమాటల యవసరమున తలపవలము సచ్యుత వీనిన్" అని చెప్పినపుడు సంధికోరుతూ శ్రీ కృష్ణుని రాయబారిగా పంపుతున్న ధర్మరాజాదులను హేళన చేసినట్టుగా వుంది.

సంజయ రాయబార ఘట్టంలో సంజయుడు ధర్మరాజును "మీరంతా క్షేమమేనా?" అని అడిగినపుడు "ఆ రాజు మాదెసం గల కారుణ్యము కతమునను సుఖంబున నిట్లున్నారము" అని చెప్పినపుడు ఎంతటి ఎత్తిపొడుపు దాగున్నదో తెలుగువాళ్ళకే తెలుస్తుంది.

తిక్కన యుద్ధ తంత్రాలు తెలిసిన రాజనీతజ్ఞుడు, సంజయుడు, శ్రీకృష్ణుడు, ధర్మరాజు ముగ్గురూ పోటాపోటీగా రాజనీతిని ప్రదర్శించారు. యుద్ధ వ్యూహాలను వివరించేటప్పుడు, యుద్ధాన్ని వర్ణించేటప్పుడు తక్కన రాజనీతజ్ఞత, లోకజ్ఞత, యుద్ధ తంత్ర నైపుణ్యము వ్యక్తమవుతాయి.

## ఆధార గ్రంథాలు:

1. తెలుగు సాహిత్య సమీక్ష

   –జి. నాగయ్య–నవ్యపరి శోధక ప్రచురణలు, భవానీనగర్–తిరుపతి.

2. శ్రీమహాభారతము – గీతాప్రెస్ – గోరఖ్‌పూర్

3. శ్రీమదాంధ్ర మహాభారత ప్రవచనము–బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

   ఎమెస్కో